నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-చింతపల్లి

ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏపీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు రోజుకి రూ. 600 వేతనంచెల్లించాలని, కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఇతర ఉపాధి సిబ్బందిని పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వుడుగుండ్లరాములు వనం యాదయ్య పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టిసారించాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్

నవతెలంగాణ-మునుగోడు



రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక అమరవీరుల భవనంలో నిర్వహించిన ఆ సంఘం మునుగోడు మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. ఉద్యోగాల అర్హత వయసును పెంచాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో ఆ సంఘ: జిల్లా కమిటీ సభ్యులు కట్ట లింగస్వామి, నాయకులు, పగిళ్ల మదు, చి భిక్షం, సాదిక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకల మధ్య సాగుతున్న కౌంటింగ్

- ఎమ్మెల్సీ కౌంటింగ్ లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఆర్వో
- బీఆర్ఎస్ విజయాన్ని అడ్డుకునే కుట్ర
- కాంగ్రెస్ అభ్యర్థికి లీడ్ వస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ఆర్వో పూర్తిగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో పూర్తిగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. కౌంటింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై ఆర్వో దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్వో పట్టించుకోకుండా కాంగ్రెస్ అభ్యర్థికి లీడు వస్తున్నట్లు ఏకపక్షంగా ప్రకటిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం తమకు డేటా సక్రమంగా ఇవ్వడం లేదని ,సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. హాల్ నెంబర్ 4లో బీఆర్ఎస్ 539 ఓట్ల మెజార్టీ ఉన్నా ఫలితాల్లో అధికారులు గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. మూడో రౌండ్ కౌంటింగ్‌లో తమకు అనేక అనుమానాలు ఉన్నాయని చెప్పారు. తమ గెలుపును అడ్డుకునే కుట్ర జరుగుతుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మళ్లీ రీకౌంటింగ్ చేయాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై తమకు పూర్తిగా నమ్మకం ఉందని ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ పై వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్ల సంతకం లేకుండానే కాంగ్రెస్ అభ్యర్థి లీడ్ లో ఉన్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా రిజల్ట్ ను ప్రకటిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి 18876 ఓట్ల లీడు ఉన్నట్లు ప్రకటించారని ఇందులో 1100 ఓట్లు అనుమానాస్పదంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుల్లో కూడా పూర్తిగా అక్రమాలు జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం రీకౌంటింగ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటమిని ముందుగా తెలుసుకోవడం సంతోషం

- ఇది అధికారులపై మన్ను పోసి పోయే కార్యక్రమం
- అన్ని విఫలమై పట్టు కోల్పోయి మాట్లాడుతున్నారు
- బీఆర్ఎస్ నాయకులు తుది ఫలితం వచ్చేవరకు ఉండాలి : తీన్మార్ మల్లన్న



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు మీడియా కంటే ముందు, అధికార పక్షంలో ఉన్న మాకంటే ముందు, అధికారుల కంటే ముందు తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టేకే పరిస్థితి లేదని కౌంటింగ్ హాల్ నుండి ఉత్త చేతులతో పోవడం ఎందుకని అధికారుల మీద మన్ను పోసి పోయే కార్యక్రమం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మండిపడ్డారు. గురువారం కౌంటింగ్ కేంద్రం వద్ద మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆర్వోపై, అదేవిధంగా జిల్లా అధికారులపై చేసిన ఆరోపణలపై ఆయన మాట్లాడారు. కేటీఆర్ డైరెక్షన్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో 100 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి అక్రమంగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం.. గతంలో మాదిరిగా బోగస్ ఓట్లతో లబ్ది పొందాలనే కుతంత్రం.. అధికార పార్టీ అభ్యర్థిగా ఉన్న నాపై అనేక రకాలుగా బురద చల్లి గెలవాలనే ప్రయత్నాలు బేడిసి కొట్టి ఇవాళ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టుకోల్పోయి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'ఆట ఆడదాం రావే అంటే పాత గజ్జలు ఉన్నాయి.. నేను ఎలా ఆడతా అన్నాడంట' ఆ విధంగా యుద్ధంలో గెలవచేత కాక ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికల్లో పాల్గొంటున్న తనకు అధికారులు సపోర్ట్ చేశారని మాట్లాడడం దుర్మార్గమన్నారు.అధికారులు నా సెల్ ఫోన్ ని కూడా అనుమతించలేదని పేర్కొన్నారు.ఒకవేళ అధికారులు తనకు సపోర్ట్ చేసినట్లయితే ఆ విధంగా జరిగేది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రెస్ మీట్ ను చూస్తూ ఉంటే ఓటమిని ఒప్పుకున్నట్లే అనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ వాళ్లు దయచేసి వెళ్లిపోవద్దని.. తుది ఫలితం వచ్చేవరకు ఉండాలన్నారు. కేటీఆర్ ఫోన్ రాగానే మరో కార్యక్రమం చేపట్టే అవకాశముంటుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల

పరిరక్షణ బాధ్యత ప్రజా ప్రతినిధులదే

- బడిబాట కరపత్రాన్ని విడుదల చేసిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ప్రజా ప్రతినిధులదే అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రజలకు సంబంధించినవని వీటిని ప్రజలే కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తారని, నాణ్యమైన విద్య లభిస్తుందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వార్డు సభ్యుని నుండి మొదలుకొని ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ప్రజాప్రతినిధి పై ఉందన్నారు. విద్య అంగట్లో సరుకు లాగా అమ్మబడితే సమాజంలో విలువలు ఉండవని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ విషయం గురించి ఆలోచించి, విద్యా వ్యాపారాన్ని ఎంత మాత్రం కూడా ప్రోత్సహించకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లల్ని చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మండలంలోని వివిధ వార్డుల్లో, చిన్న నారాయణపురం గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్కట్ పల్లిలో చేర్పించడానికి సాను కూలంగా స్పందించినట్లు ప్రధానోపాధ్యాయులు డి రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాములు, ఉపాధ్యాయులు కవిత, సంధ్యారాణి, శ్యామల, శ్రీలత, ఐ.కవిత, సులోచన, ఆంథోని, శేఖర్రెడ్డి, జానకీరాణి, మంజుల, శ్రీనివాస్, సుశీల, లక్ష్మి, ఆరోగ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు .

చిట్యాలటౌన్: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని డోర్ టు డోర్ నిర్వహించిన ఆయన తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్రాంపల్లి జెడ్పిహెచ్ఎస్ ప్రధా నోపాధ్యాయులు కొండ కింది అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పై కేసు నమోదు

- విధులకు ఆటంకం కలిగించారని ఏఆర్ఓ ఫిర్యాదు

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిపై తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించారని ఏఆర్ఓ వెంకటేశ్వర్లు తిప్పర్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సమాచారం. వివరాల్లోకి వెళితే... నల్గొండ వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల కౌంటింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ఓ, అడిషనల్ కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు పై ఈనెల 5న రాత్రి 8:30 గంటల నుంచి 9.30 గంటల మధ్య సమయంలో ఇండిపెండెంట్ అభ్యర్థి ఐడి కార్డు ద్వారా అనుమతి లేకుండా రెండవ హాల్లోకి వచ్చి కౌంటింగ్ సిబ్బంది సరిగా బ్యాలెట్ పత్రాలు చూపించడం లేదని నాతో వాగ్వివాదానికి దిగి, నన్ను బెదిరించి, నా విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఐడి కార్డును పరిశీలించగా స్వతంత్ర అభ్యర్థి పెట్టెం మల్లికార్జునకు సంబంధించి హాల్ నెంబర్ మూడు యొక్క ఏఆర్వో ఏజెంట్ గా పాస్ కలిగి ఉన్నట్లు తెలిపారు. నేను పనిచేస్తున్న కౌంటింగ్ హాల్ నెంబర్ 2లోకి అనుమతి లేకపోయినా అందులోకి వచ్చి నా యొక్క విధులకు ఆటంకం కలిగించి నన్ను బెదిరించిన కంచర్ల భూపాల్ రెడ్డి పై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ర్యాంక్ సాధించడం

అభినందనీయం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



మెడికల్ సీట్లు కేటాయించడం కోసం జరిగిన నీట్ పరీక్షలో గిరిజన విద్యార్థిని భూక్యా సిరి వెన్నెల సాయి జాతీయ స్థాయిలో గిరిజన కేటగిరిలో 18వ ర్యాంక్ సాధించడం అభినందనీయమని మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఇంటికి వెళ్లి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని కష్టపడి చదివి ర్యాంక్ సాధించి మిర్యాలగూడకు పేరుప్రఖ్యాతులు తీసుకురావడం హర్షణీయమన్నారు. సిరి వెన్నెల సాయి గొప్ప ఉన్నత విద్యను అభ్యసించి మంచి డాక్టర్ గా స్థిరపడి నలుగురికీ సేవ చేయాలని కోరారు. అనంతరం విద్యార్థిని సిరి వెన్నెల సాయికి స్వీట్లు తినిపించి శాలువాతో సన్మానించి స్టెతస్కోప్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, మక్ల నాయక్,శంకర్ నాయక్,వెంకన్న నాయక్,నూకల వేణుగోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు రవి నాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, యూత్ నాయకులు నాగునాయక్, సిద్ధునాయక్,అశోక్ నాయక్,మధునాయక్,హరి నాయక్, మంగ్త నాయక్,శ్రీను నాయక్,వెంకన్న, సైదా నాయక్,కృష్ణకాంత్, చీన నాయక్,చిన వెంకన్న,కుర్వ నాయక్, రవీందర్ పాల్గొన్నారు.

రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం



నవతెలంగాణ - చండూరు

ఖరీఫ్ సీజన్లో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను సబ్సిడీ పైప్రభుత్వం అందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు సరఫరా చేసే విత్తన కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించి, రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.ప్రభుత్వమే రైతులకు యంత్ర పరికరాలను 50శాతం సబ్సిడీ పై, దళిత, గిరిజన, సన్న కారు రైతాంగానికిప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకురెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, నేటికీ అమలు చేయలేదని, రైతులకు పంట రుణాలను వెంటనే ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకం అందివ్వాలని దాని ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందుకాంగ్రెస్ ప్రభుత్వంరైతులకు ఇచ్చిన హామీలనువెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చండూరు మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, చండూరు మండల సహాయ కార్యదర్శిజెర్రిపోతుల ధనంజయ గౌడ్,కొత్తపల్లి నరసింహ,గౌసియా బేగం,రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమినరీ పరీక్షకు శిక్షణ



నవతెలంగాణ -నల్లగొండ టౌన్

ఈ నెల9న ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నోడల్ ఆఫీసర్ ,అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లకు, బయో మెట్రిక్ ఇన్విజిలేటర్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు నల్గొండ జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా నుండి 16899 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ తో పాటు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులు ఎలాంటి మొబైల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ వస్తువులు ,క్యాలిక్యులేటర్లు, టాబ్లెట్స్, పెన్ డ్రైవ్ లు, బ్లూటూత్ డివైస్లు, ఎలక్ట్రానిక్ వాచ్ లు, మ్యాథమెటికల్ టేబుల్స్ ,లాక్ బుక్కులు, లాగ్ టేబుల్స్, వాలెట్లు, హ్యాండ్ బ్యాగ్ లు, రైటింగ్ ప్యాడ్, అలాగే బంగారు ఆభరణాలు, ఇతర గాడ్జట్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, రికార్డింగ్ వస్తువులు అనుమతించకుండా జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ఉదయం 9:30 గంటల నుండి అభ్యర్థుల బయోమెట్రిక్ విధానం ప్రారంభమవుతుందని, అందువల్ల తప్పనిసరిగా బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ వేయని, ఓఎంఆర్ ఆన్సర్ సీటును అప్పగించిన అభ్యర్థుల ఓఎంఆర్ ల ఆన్సర్ మూల్యాంకనం చేయరని తెలిపారు. అలాగే పరీక్ష రాసే అభ్యర్థులు మెహెంది ధరించవద్దని ,తాత్కాలిక టాటూస్, అభ్యంతరకరమైన మెటీరియల్ ను ధరించడం వంటివి చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి డీఎస్పీ రమేష్, రిజనల్ కోఆర్డినేటర్ ఉపేందర్, చీఫ్ సూపరింటెండెంట్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ- నకిరేకల్

భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం యాదగిరిగుట్టలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల నిర్వహించిన వారిలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి , మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నకిరేకల్, భువనగిరి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

చేపల రైతు విలవిల

- ఎండ తీవ్రతకు చనిపోయిన 2 టన్నుల కొర్రమీను చేపలు

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్

భానుడి దెబ్బకు భూమి పై ఉన్న జీవరాసులే కాక నీటిలో ఉన్న జలచరాలకు కూడా మృత్యువాత తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యం పంటలు పండించే చిన్న ,సన్నకారు రైతులపైయ్యే కాక కుంటలు తవ్వి చేపలను సాగు చేస్తున్న రైతుల పై కూడా దాని ప్రభావం తప్పడం లేదు.





మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలోవడిత్య రైతు మాంగు తన పొలంలో రెండు లక్షలు అప్పు చేసి 30 గుంటలు విస్తీర్ణంలో చేపల చెరువు తవ్వి 6వేల కొర్రమీను పిల్లలను 8 నెలలుగా సాగు చేస్తున్నాడు. తీరా అమ్ముదాం అనుకునే లోపు ప్రకృతి వైపరీత్యం ఈదురు గాలుల వల్ల ఆ ఊర్లో కరెంటు స్తంభాలు పడిపోయి రెండు రోజులు కరెంటు లేకపోవడంతో ఆ చెరువులో నీటిని ఆరెండురోజులు మార్చలేదు . ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ఆకుంటలో నీళ్లు వేడెక్కి రెండు టన్నుల కొరమీను చేపలు మంగళవారం చనిపోవడంతో రైతు కన్నీరు పెట్టుకున్నాడు. చేసిన అప్పుతో కలిపి 8లక్షల నష్టం వచ్చిందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి
వడిత్యమాంగు

రెండు లక్షల అప్పు చేసి 30 గుంటల విస్తీర్ణంలో చేపల చెరువు తవ్వించి కొర్రమీను చేపల పెంపకం చేస్తున్నాను. ఎండ తీవ్రత వల్ల చెరువులో నీళ్లు వేడెక్కి రెండు టన్నుల కొరమీను చేపలు చనిపోయాయి. నాకు 8 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిం.ది ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

చెరువును తలపిస్తున్న రహదారి

నవతెలంగాణ - చండూరు

వర్షం వచ్చిందంటే చండూరు మున్సిపాలిటీలో ప్రధాన రహదారి వెంబడి వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తూ ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. వర్షాకాలం ప్రారంభంలోనే వాహనదారులకు ప్రయాణ తిప్పలు మొదలయ్యాయి అని మున్సిపల్ ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చండూరులో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కస్తూర్బా పాఠశాల ముందు రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రెయినేజీ పనులు అసంపూర్తిగా వదిలేశారు. డ్రెయినేజీలో నిలిచిన మురుగు నీరుతో వచ్చే దుర్గందం, దోమలతో ప్రజలు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ప్రవహిస్తున్న వాగు

దీనికి తోడు ఎగువ నుంచి వచ్చిన వర్షపు నీరు ఎటు పోలేక రోడ్డుపైనే ఎక్కువ మొత్తంలో నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి కావటంతో రోజు ఎక్కువ మొత్తంలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. వర్షాకాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ముందు ముందు ఇంకా ఎంత ఇబ్బంది పడలో అని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండటం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూరి చేయాలని అప్పటిలోగా వర్షం నీరు పోవడానికి అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లపై వర్షపు నీరు జేసీబీ సహాయంతో తొలగింపు ..

గురువారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని చండూరు మున్సిపల్ ఆధ్వర్యంలో జెసిబి సాయంతో మున్సిపల్ కమిషనర్ మణికరన్, కౌన్సిలర్లు తోకల వెంకన్న, అనపర్తి శేఖర్ నీటిని తొలగించారు. దీంతో వాహనదారులకు, బాటసారులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంది. ఏది


రహదారిపై చేరిన నీరు

ఏమైనా చండూరు రోడ్లు ఇంతేనా... వాటిని బాగు చేయలేరా ! అధ్వానమైన రోడ్లపైనే ప్రయాణం చేయాలా అని మున్సిపల్ ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రవహిస్తున్న చండూరు వాగు...

వర్షాకాలం ప్రారంభంలోనే చండూరు చామలపల్లి శిర్ద పల్లి , తదితర గ్రామాలలో వాగులు వస్తున్నాయి. తా స్కాని గూడెం చండూరు కు , శిర్దపల్లి నుండి చండూరుకు ఉదయం రాకపోకలు ఇబ్బందిగా ఉంది. దీంతో రైతులు వాగులు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు బ్యూటీషియన్‌లో శిక్షణ

నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా కేంద్రంలో మహిళలకు బ్యూటీషియన్‌లో నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రాం నిర్వాకురాలు శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్వి విక్రమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రోగ్రాంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి మహిళల అభివృద్ధిని పెంపొందించేందుకు కేవలం ఒక వేయి రూపాయల నామ మాత్రం ఫీ తీసుకొని జూన్ 10 నుండి జూలై 10 వరకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. దీంతో బ్యూటీషన్‌గా రాణిస్తూ జీవనోపాధి పొందుతూ భర్తకు అసరగా నిలువచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు ఆధార్ కార్డు జిరాక్స్,పాస్ ఫొటో పంపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9966846111 ను సంప్రదించాలని కోరారు.

ఎంపీ చామలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తిరుమలగిరి



భువనగిరి ఎంపీగా గెలిపిందిన చామల కిరణ్ కుమార్ రెడ్డిని గురువారం కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎల్సొజు నరేష్, పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్ జుమీలాల్, నాయకులు మీడియా ఇన్‌చార్జ్ కందుకూరు లక్ష్మయ్య, కౌన్సిలర్ గుగులోతు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు..

11న సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణా తరగతులు

- కరపత్రాలు విడుదల చేసిన నాయకులు

నవతెలంగాణ-హుజూర్ నగర్‌టౌన్



మండలంలోని శ్రీనివాసపురంలో ఈనెల 11న నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు గురువారం పట్టణంలోని అమరవీరుల భవనంలో శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని హుజూర్ నగర్‌టౌన్, హుజూర్‌నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి మండలాల పార్టీ సభ్యులు హాజరు కావాలని కోరారు. బిజెపి పాలనలో రెండు దఫాల పరిపాలనలో అనుసరించిన విధానాల మూలంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన ప్రతిష్ట మసక బారిందన్నారు. మతం, కులం పేరుతో రాజకీయాలు చేసిన మోడీని అయోధ్యలో వెనక్కి కొట్టడం శుభ పరిణామమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే మోడీని ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా ప్రజాస్వామ్య శక్తులు ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా రాజకీయాలు వేగంగా మారుతున్నటువంటి సందర్భంలో పార్టీ నాయకులు కార్యకర్తలు చైతన్యం చేయడం కోసం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నం వీరమల్లు, పాశం వెంకట్ నారాయణ , తురక వీరయ్య, రేపాకుల వీరస్వామి, చింతకాయల పర్వతాలు, పాశం వీరబాబు, శీలం వెంకన్న, జి. శ్రీను, ఎలక సోమయ్య, ఇంటి తిరపయ్య, ఉప్పతల గోవింద తదితరులు పాల్గొన్నారు.



సోమమ్మ దశదిన కర్మలో పాల్గొన్న సీపీఐ(ఎం), ఇతర నాయకులు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ శ్రీరాములు తల్లి సోమమ్మ ఇటీవల మరణించగా.. గురువారం ఆమె దశ దినకర్మలో సీపీఐ(ఎం), వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తూముల భుజంగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల సురేష్ రావు, ఎంపీపీ నెమ్మది బిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, జిల్లా నాయకులు మామిడి అంజయ్య, కాంగ్రెస్ నాయకులు మామిడి వెంకన్న, సందీప్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల వెంకటేశ్వర్లు, జగన్, జుట్టుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల దాహార్తిని తీర్చుతున్న సుధాకర్ పీవీసి యాజమాన్యం

- మూడు లక్షలతో పలు కూడళ్లలో చలివేంద్రాలు
- ప్రయాణికుల నీటి సౌకర్యార్థం రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు
- ప్రజా సేవలో సుధాకర్ పీవీసీ ఎండి మీలా మహదేవ్

నవతెలంగాణ-సూర్యాపేట



వేసవి కాలం వచ్చిందంటే చాలు ప్రజలకు తాగునీటి కష్టాలు వెంటాడుతాయి. మండుటెండలో తాగడానికి నీళ్లు లభించక ఎందరో నీటి ఇబ్బందులు పడుతున్నారు. కాగా సూర్యాపేట జిల్లా కేంద్రం అయినప్పటి నుండి పట్టణానికి వివిధ ప్రాంతాల నుండి రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో వేసవి ప్రారంభం కాగానే గత ఏప్రిల్, మే,జూన్ నెలలో పట్టణానికి వచ్చే ప్రజలు, బాటసారులు దాహార్తి కోసం అల్లాడేవారు. ఈ నేపథ్యంలో సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి మీలా మహదేవ్ స్పందించారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి గాను జిల్లా కేంద్రంలో చలి వేంద్రాల ఏర్పాటు కు ఆయన ముందుకు వచ్చారు. ఇందుకు గాను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సుధాకర్ గ్రూప్ అఫ్ ఇండస్ట్రీ వారిని సీఎస్ఆర్ పథకం కింద 8 ప్రాంతాలలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని మీల మహాదేవ్ ను కోరగా వెంటనే స్పందించిన ఆయన మున్సిపాల్టీ వారి కో ఆర్డినేషన్ తో పట్టణంలో చలి వేంద్రాల ఏర్పాటు కొత్త రూ 3.00 లక్షలు కేటాయించారు. పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి కోసం గాను గత ఎప్రిల్ నెలలోనే జిల్లా కేంద్రంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ముందు,పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో,కూరగాయల మార్కెట్,కొత్త బస్టాండ్ (రాజధాని హోటల్ ముందు), ముత్యాలమ్మ గుడి, పీఎస్ఆర్‌సెంటర్, జమ్మిగడ్డ ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి ని తీర్చుతున్నారు. అదేవిధంగా వివిధ ప్రాంతాలకు దూర ప్రయాణం చేసే వారి దాహార్తిని తీర్చడానికి గాను మీలా మహదేవ్ బస్టాండ్ లలో ఆర్వో ప్లాంట్లను..ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వెంటనే లక్షలాది రూపాయలు వెచ్చించి సూర్యాపేట డిపో పరిధి లో ఉన్న కొత్త బస్టాండ్,హైటెక్ బస్టాండ్ లలో ప్రయాణికుల మంచి నీటి సౌకర్యార్థం కోసం రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వేసవి లో బాటసారులు,ప్రయాణికుల దాహార్తి ని తీర్చుతున్న సుధాకర్ పీవీసీ యాజమాన్యం పట్ల ప్రతి ఒక్కరూ కృతజ్ఞత భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ పీవీసీ ఎండి మీలా మహదేవ్ మాట్లాడుతూ ప్రజల సేవలో సుధాకర్ పీవీసీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని చెప్పారు.



గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్ రావు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తూముల సురేష్ రావు అన్నారు. మండల పరిధిలోని చిన్నగారకుంట తండా ఆవాసం పెద్దగారకుంట తండాలో బొడ్రాయి పదవ వార్షికోత్సవ సందర్భంగా పిజికేటి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, చతుర్థ బహుమతి రూ.2 వేల ఐదు వందలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మామిడి వెంకన్న, మాజీ సర్పంచ్ బండి రామకృష్ణారెడ్డి, నాయకులు బచ్చలకూరి సైదులు, భుక్య సందీప్ రాథోడ్, నిర్వాహకులు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

17 లక్షలా 40 వేలకు దేవాలయ భూమి కౌలు వేలం

- దేవాదాయ శాఖ అధికారి కుశలయ్య

నవతెలంగాణ-నూతనకల్

మండల పరిధిలోని మి ర్యాల గ్రామానికి చెందిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ పరిధిలో ఉన్న భూమి సుమారు 100..20 ఎకరాల భూమి సంవత్సరం కౌలు గురువారం దేవాలయంలో వేలం నిర్వహించినట్లు దేవాలయ శాఖ అధికారి కుశలయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన కొంపెల్లి నాగరాజు 17 లక్షలా40వేలకు వేలం పాడి ఆ భూమి కౌలు ను దక్కించుకున్నట్టు తెలిపారు.తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్ స్థానిక ఎస్సై జె సైదులు మద్దిరాల ఆత్మకూర్ ఎస్సై లతోపాటు ప్రత్యేక బలగాలతో భారీ బందోబస్తులో వేలంపాట నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవాలయ శాఖ అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల నమోదు ప్రక్రియ గణనీయంగా పెంచాలి



నవతెలంగాణ-నేరేడుచర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ గణనీయంగా పెంచాలని మండల విద్యాధికారి పానుగోతు. చత్రూ నాయక్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచుకునే సదవకాశంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకుగల సౌకర్యాల కల్పన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, ఎస్ఎస్సిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న తదితర అంశాలను కరపత్రాల ద్వారా వివరిస్తూ, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.అనంతరం కమిషనర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది నాణ్యమైన విద్య అందిస్తున్నారని, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు సౌకర్యాలు ఉన్నాయని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు బడిబాట తల్లిదండ్రుల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ ఇంజమురి శ్రావణి మాజీ ఎస్ఎంసి చైర్మెన్ చిలకరాజు శ్రీను విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రారెడ్డి బుద్ధారెడ్డి మెప్మా ఆర్పీలు ఉష సరిత నాగలక్ష్మి కృష్ణకుమారి రోజా నాగమణి కళ్యాణి ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పద్మావతి, సైదులు, రషీద్ శౌరి, వెంకటేశ్వరరావు, అన్నపూర్ణ, ప్రభాకర్ రెడ్డి, మాధవి, నరసింహారావు ,భవాని, కళ్యాణి, స్రవంతి, కృష్ణ ప్రసాద్, శ్రీనివాసరావు, నగేష్, పద్మ ,లాల్ సాహెబ్, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేటు పాఠశాలలను నమ్మి డబ్బు వృథా చేసుకోవద్దు

- జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-పెన్‌పహాడ్

ప్రయివేటు పాఠశాలలను నమ్మి డబ్బు వృథా చేసుకోవద్దని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎండి జమాల్ షరీఫ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ప్రో.జయశంకర్ బడిబాట సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల విజ్ఞానానికి నిలయాలని అవి విద్యార్థుల సంపూర్ణ మూర్తిమత్వాన్ని వికసింపచేసి ఉజ్వల భవిష్యత్తు కలుగజేస్తాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులు, మినరల్ వాటర్, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రవేశం కోసం వేచి ఉన్న విద్యార్థులకు అడ్మిషన్లను అందించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి ఆసియా జబీన్, ప్రధానోపాధ్యాయులు వీరేందర్, సుశీల, ఉపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, ఉపేంద్ర, ధనలక్ష్మి, మల్లీశ్వరి, వెంకటేశ్వర్లు, భీక్షం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వడ్డీ వ్యాపారి

నవతెలంగాణ-తిరుమలగిరి



తిరుమలగిరి మున్సిపల్ కేంద్రానికి చెందిన ప్రముఖ వడ్డీ వ్యాపారి కొడిదల ఉప్పలయ్య గురువారం మోత్కూరు రోడ్డు సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి తెలిసిన వివరాలు ప్రకారం... గత కొన్ని రోజుల నుండి కుటుంబంలో జరుగుతున్న అంతర్గత కలహాలతోనే మనస్తాపం చెంది ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలుస్తోంది.ఉప్పలయ్య గత 40 సంవత్సరాలుగా పట్టణంలో చిరు వ్యాపారులకు డైలీ ఫైనాన్స్ యిస్తూ వ్యాపారం సాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎందరో వ్యాపారులకు వడ్డీ వ్యాపారంతో చేయూతనిచ్చాడు.ఇతని మృతితో పలువురు తోపుడు బండ్ల వ్యాపారస్తులు సంతాపం తెలిపారు.కాగా సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక ఎస్సై సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పంచానామా నిర్వహించి, .మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న ఆటో.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి





బైకు, ఆటో ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామ సమీపాన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ..గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ నరసింహ తండ్రి చిన్న జంగయ్య (వయసు 45 సంవత్సరాలు) గురువారం తన అత్తగారు ఇళ్ళు అయిన మొండి కానుగూడం గ్రామానికి విత్తనాలు వేసేందుకు వెళ్లి తిరిగి బైక్ పై సాయంత్రం గుమ్మడవెల గ్రామానికి వస్తుండగా అదే సమయంలో మొండి కాను గూడెం గ్రామానికి చెందిన ఆటో గుమ్మడవెల్లి నుంచి మొండికాని గూడెం వైపునకు వెళ్తుండగా మార్గమధ్యలో గల గుమ్మడవల్లి గ్రామ సమీపాన వద్దకు రాగానే ఆటో బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న నరసింహకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే నరసింహను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి నరసింహ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. నరసింహ మృతితో అటు అత్తగారు గ్రామంలో, ఇటు గుమ్మడవల్లి స్వగ్రామంలో విషాధ ఛాయలు అమ్ముకున్నాయి.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన పట్టణంలోని కోర్టులలో నిర్వహించే లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ శ్యాంకుమార్‌లు గురువారం ఓ ప్రకటనలో తెలుపుతూ కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్ వున్న కేసులలో కక్షిదారులు రాజీ పడడం వల్ల వారి సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. లోక్ అదాలత్ నిర్వహణకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు నాళం రాజన్న, తాటి మురళీ లను, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, 1వ, 2వ అదనపు కోర్టులకు గాను న్యాయవాదులు ఆవుల మల్లికార్జున రావు, అర్వపల్లి పవన్ లను ఆయన నియమించారు. సభ్యులుగా నియమితులైనవారు లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో కోర్టు సిబ్బందికి సహకరించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

కోదాడ మున్సిపాలిటీ కార్యాలయంలో శుభ్రత ఏదీ ?

నవతెలంగాణ-కోదాడరూరల్



స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం దుమ్ముధూళీ, దుర్వాసనలతో అపరిశుభ్రంగా తయారైంది. పట్టణవాసులు అధికారులను కలవడానికి వస్తే తుప్పు పట్టిన బీరువాలు వాటి కింద ఉన్న దుమ్ము బూజు ఇలాంటివి ముందుగా అక్కడికి వచ్చిన వారిని పలకరిస్తాయి. ఈ సందర్భంగా ఓ జాతీయ పార్టీకి చెందిన నాయకుడు గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి తన అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ కార్యాలయంలో శుభ్రత పాటించాలని వినతిపత్రం అధికారులకు అందించారు. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పరిశుభ్రత పాటిస్తున్న మున్సిపాలిటీ కార్యాలయం అపరిశుభ్రంగా ఉండటం ఏంటని పలువురు పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. వర్షానికి కార్యాలయ ఆవరణలో నీరు అధికంగా నిలబడి బురదమయంగా మారుతోందని తెలుపుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయం శుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
యాదాద్రి భువనగిరి
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

గొలనుకొండలో జయశంకర్ బడిబాట



నవతెలంగాణ-ఆలేరుటౌన్

మండల పరిధిలోని గోలనుకొండ గ్రామంలో జూన్6 నుండి 13 వరకు జయశంకర్ బడిబాటలో భాగంగా గురువారం గ్రామస్థాయిలో స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వయంసాయక సంఘాలు, విద్యార్థులకి దుస్తులు పాఠశాల కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మారిపల్లి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల మల్లయ్య, పిఎస్ ఇంచార్జ్ హెచ్ఎం స్వామి నాయక్, గ్రామ పెద్దలు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా చేగురి మల్లేశం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-వలిగొండరూరల్

టేకులసోమారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతూ.. ఎల్లవేళలా పేద ప్రజలకు అండగా ఉంటూ సహకరిస్తున్న చేగూరి మల్లేశం జన్మదిన వేడుకలను చేగూరి మల్లేషన్న అభిమాన సంఘం టేకులసోమారం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల సాధన సంస్థలో పండ్లు పంపిణీ, కేక్ కట్ చేసి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నారగోని పాండు, చేగూరి పరమేష్, తులసిమొగ్గ గోవర్ధన్, కనుకుంట్ల కొండల్, పడమటి గణేష్ రెడ్డి, దంతూరి రాజు, చేగూరి రామలింగం, బాలకృష్ణ సురేష్, మురళి,నర్సింహా, వినయ్, గణేష్, ఉదయ్, మల్లేషన్న యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సేవలు ఆమోఘం

బీసీ సంక్షేమ సంఘం నేత జూకంటి ప్రవీణ్ కుమార్
జిల్లాలో ఘనంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రాజపేట

తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సేవలు అమోఘం అని, ఆయన జన్మదినం సందర్భంగా గురువారం రాజపేట మండల కేంద్రంలో బీసీ సంఘాలు, కురుమ సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్విహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆలేరు



రాజపేటలో..

అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న బీర్ల ఐలయ్య సేవలను ఈ ప్రాంత ప్రజలు ఏప్పటికి మర్చిపోరన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు వస్పరీ సుధాకర్, చీర మహిపాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు అంకతి బాలయ్య, గౌటే లక్ష్మణ్,బొడ్డుల నగేష్, మాడిషెట్టి సురేష్, బాల్ల శ్రీకాంత్, మోటే బాల మల్లేశ్,కాకళ్ల భారత్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

రాజాపేట మండల కేంద్రంలో గురువారం ఇందిరా గాంధీ



రాజపేటలో..

విగ్రహ ప్రాంగణంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు



రాజపేటలో..

ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహిళా కార్యకర్తలు నాయకులు ప్రజా ప్రతినిధులు యువజన కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ నాయకులు జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ చేసారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేసారు. బీర్ల ఐలయ్య పిలుపుమేరకు శాలువాలు, అట్టహాసాలు చేయకుండా విద్యార్థులకు పుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేసారు. ప్రతి రాజకీయనాయకుడు బీర్ల ఐలయ్య ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ప్రతి ఒక్కరు పాల్గొని ఇతరులకు సహాయం చేయాలని మండల పార్టీ



ఆలేరు టౌన్..

అధ్యక్షులు మహేందర్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నమిలే మహేందర్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మూడవ రాంజీ నాయక్, బొడ్డుల నగేష్ కుమార్, విట్టల్ నాయక్, ఆడెపు శ్రీశైలం, మంచాల వీరేశం, మసిరెడ్డి సురేందర్ రెడ్డి, నవీన్ కుమార్, ఇంజ నరేష్, రంగా ఆంజనేయులు, శ్రవణ్, బొంత సుధాకర్, సురేష్, గౌర బక్కులు, పాండవులు బసవరాజు గౌడ్, మహిళా అధ్యక్షురాలు రేణుక, రాజాపేట మండల అన్ని గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అనుబంధ విభాగాల నాయకులు మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రక్తదానం చేసిన చల్లూరు వాసి బొంత సుధాకర్

బీర్ల ఐలయ్య పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని చల్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ మండల అధ్యక్షులు బొంత సుధాకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం గురువారం నిర్వహించారు. కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాగ నవీన్, బొడ్డు సురేష్, గడమల యాదేందర్, చాడ బంగారి, మంతపురి పరుశురాం, గుంటి యాదగిరి, గుజుక ఉపేందర్, మరి కొంతమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడే ఎల్లయ్య, మాజీ ఎంపిటిసి బడే ఇందిర నర్సింగరావు, కురుమ సంఘం మండల గౌరవాధ్యక్షులు మీసా బాల మల్లయ్య, సీనియర్ నాయకులు దిడ్డిగా రమేష్, భీమ గాని బాల నరసయ్య, మునిగడప కనకయ్య, బడే నర్సింగరావు, చిట్కురి గౌరయ్య, మీసా కరుణాకర్, సిధారపు మహేందర్, బడే రామచందర్, గ్యార రాములు, పల్లపాటి నవీన్, బండ కాడి రాముడు, వర్కల శ్రీను, కొమ్ము యాదగిరి, గణపురం సాగర్, బడే అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎం): మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదినం సందర్భంగా గురువారం కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను మండల నాయకులు, కార్యకర్తలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్ జడ్పిటిసి కె నరేందర్ గుప్తా వైస్ ఎంపీపీ భాష బోయిన పద్మ పాపయ్య పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి ఆత్మకూర్ గ్రామ మాజీ సర్పంచ్ జన్నాయి కోడే నగేష్ మాజీ ఉపసర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొంతరబోయిన నవ్య భాస్కర్ మండల నాయకులు కే అనంతరెడ్డి,ఎం సిద్ధులు,డి భాస్కర్,కె హనుమంతు,ఎస్ లక్ష్మారెడ్డి,పి మల్లేశం,ఎ వెంకటేశ్వర్లు, ఆర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలేరుటౌన్: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం ఆలేరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల ఘనంగా నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు ఎంఏ ఎజాస్, లోకేష్, బరిగే శ్రీనివాస్, యాట రాము, సంపత్, కటకం రవి, బీజని భాస్కర్, బొడ్డుల శ్రీనివాస్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు యాదగిరిగుట్ట బీర్ల నిలయంలో యాదగిరిగుట్ట మండల పార్టీ ఉపాధ్యక్షులు బండి అశోక్, గ్రామ



యాదగిరి గుట్ట రూరల్..

శాఖ అధ్యక్షులు కాదూరి భానుచందర్ ఆధ్వర్యంలో మైలార్ గూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే.. యాదగిరిగుట్ట బీర్ల నిలయంలో యాదగిరిగుట్ట ఎంపీటీసీ కర్రె విజయ వీరయ్య ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలం మల్లాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రే పెద్దోళ్ళు ఐలయ్య, కర్రే పెద్దోళ్ల గణేష్, వేముల సతీష్ రెడ్డి, కర్రే రాము, శిఖ శేఖర్ గ్రామస్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు యాదగిరిగుట్ట పట్టణంలోని తన నివాసంలో ఘనంగా



యాదగిరి గుట్ట రూరల్..

నిర్వహించారు. బీర్ల ఐలయ్య ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా ఎన్నిక అయిన తర్వాత మొదటి సారి జరిగిన జన్మదిన వేడుకలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనీల్ కుమార్‌రెడ్డిలు హాజరై బీర్లకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడారు. తన పై అభిమానం తో జన్మదిన వేడుకలకు హాజరైన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వర్తక సంఘం అధ్యక్షులు గడ్డమీది మాధవులు, సైదాపురం మాజీ ఉప సర్పంచ్ దుంబల సురేఖ వెంకట్ రెడ్డి, ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షులు కానుక బాలరాజ్ గౌడ్, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు బందరపు బిక్షపతి గౌడ్,



యాదగిరి గుట్ట..

తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ బీర్ల ఐలయ్య జన్మదిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య చేతుల మీదుగా నవతెలంగాణ బర్త్ డే స్పెషల్ సంచిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భువనగిరి చౌటుప్పల్ ఇంచార్జ్‌లు డివిజన్ ఉస్మాన్ షరీఫ్, ఎల్లంలా వేంకటేశ్ డివిజన్ సినియర్ రిపోర్టర్ మొరిగాడి మహేష్, రిపోర్టర్లు పేరబోయిన నర్సింహులు, ఆరే నరసింహ, వడ్లకొండ అనిల్, బూడిద చంద్రగిరి పాల్గొన్నారు.



గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కే జెండగే
- రాష్ట్రంలో జూన్ 9న గ్రూప్-1 పరీక్ష



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

గ్రూప్-1 పరీక్షను పక్కాగా నిర్వహించాలని, నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేటు సమావేశ మందిరంలో ఛీఫ్ సూపరిటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెండిఫికేషన్ ఆఫీసర్స్, బయోమెటిక్ ఆఫీసర్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీజీపీఎస్సీ ద్వారా ఈనెల 9వ తేదీన నిర్వహించబడుతున్న గ్రూప్ -1 పరీక్ష ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, పరీక్ష వ్రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు ఉండాలని ఆదేశించారు. ఛీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష నిర్వహణను చేపట్టాలని, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు కేంద్రాలలో సీటింగ్ అరేంజ్మెంట్, వసతులు పరిశీలించాలని, ఆడ మగ అభ్యర్థులకు విడివిడిగా తనిఖీ ఏర్పాట్లు చేయాలని, ఇతరులను అనుమతించవద్దని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణతో పరీక్షాల కేంద్రాలను పరిశీలించాలని, పరీక్ష రోజున ప్రతి సెంటర్ మూడు సార్లు పరిశీలించాలని, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు అభ్యర్థుల ఐడి కార్డులతో హాల్ టిక్కెట్లను పరిశీలించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఎవరికీ మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, ఒక చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రము ఎమర్జెన్సీ కోసం అనుమతి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు పరీక్ష వ్రాసే అభ్యర్థులు కొన్ని సూచనలు, జాగ్రత్తలు పాటించాలని కోరారు. పరీక్ష నిర్వహణకు 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయము 10.30 గంటల నుండి మద్యాహ్నం 01.00 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. సుమారు 3,349 అభ్యర్థులు హాజరగుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల గురించి, హాల్ టికెట్ డౌన్ లోడ్ గురించి జిల్లా స్థాయి హెల్ప్ లైన్ నెం.8331997006, 8331997037 సంప్రదించవచ్చునని సూచించారు. హాల్ టికెట్ ను http://www.tspsc.gov.in వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు.

హాల్ టికెట్‌లోని నిర్దేశిత స్థలంలో అభ్యర్థి లేటెస్ట్ ఒరిజినల్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను గమ్‌తో అతికించాలని, అభ్యర్థులు పరీక్షహాలుకు హాల్ టికెట్‌తో పాటుగా ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, పాన్ కార్డ్, ఓటరు ఐడి కార్డు, ఇతర ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి మరియు బ్లూ / బ్లాక్ బాల్ పాయింట్ పెన్ ను తప్పనిసరిగా తీసుకెళ్లాలని, ఒకవేళ హాల్ టికెట్‌లో ఫోటో సరిగా ముద్రణ కాకపోయినా, లేదా కనిపించనట్లయితే అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా అభ్యర్థి చివరగా చదివిన సంస్థ ప్రిన్సిపాల్ చేత ధృవీకరించబడిన మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను, అండర్‌టేకింగ్ ఫామ్ (టీఎస్‌పీఎస్‌సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌తో) పాటుగా తీసుకురావాలి. అట్టి ఫోటోలు, అండర్‌టేకింగ్ ఫామ్ ను పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు సమర్పించినట్లయితే అభ్యర్థి పరీక్షకు అనుమతించబడతారని, లేనట్లయితే అభ్యర్థిని పరీక్ష హాల్ లోకి అనుమతించబడరని తెలిపారు. చేతులకు మెహంది, టాటూలతో పరీక్షకు వెళ్లకూడదని, ఒకవేళ ఉంటే బయోమెట్రిక్ చేయుటకు తంబ్ ఇంప్రెషన్ పడకపోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు కేవలం చెప్పులు మాత్రమే ధరించాలని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థికి ఒకవేళ చేతులు లేకపోతే సహాయకులు కావాలి అని ముందుగానే దరఖాస్తు చేసినవారికి మాత్రమే పరీక్ష కేంద్రము వారు స్క్రైబ్‌ను ఇస్తారని, అనుమతి లేకుండా ఎవరూ సహాయకులను తీసుకురాకూడదని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు కనీసం ఒకరోజు ముందుగా తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్షా కేంద్రం యొక్క ఖచ్చితమైన ప్రదేశాన్ని తెలుసుకోవాలని కోరారు.

పరీక్ష కేంద్రము వద్ద వస్తువులు భద్రపరచడానికి కమిషన్ ఎలాంటి స్టోరేజీ సౌకర్యం కల్పించలేదని, కాబట్టి అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించాలని సూచించారు. పరీక్ష వ్రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం, సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించబడుతుందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సూచనలు పాటించాలని కోరారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె నారాయణ రెడ్డి, టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ, వ్యవసాయ శాఖ ఏడి నీలిమ, అధికారులు పాల్గొన్నారు.



బీపీఎంపై చర్యలు తీసుకోవాలి

పంచాయతీ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎం

మండలంలోని రాయిపల్లి గ్రామంలో మాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల డబ్బులు కాజేసిన పోస్టల్(తపాలా) బీపీఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గ్రామాల్లోని పేద ప్రజలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని చేపట్టారని, గతంలో ఉపాధి హామీ కార్మికులు వేలిముద్రల ఆధారంగా కూలి డబ్బులు బీపీఎంలు ఇచ్చేవారని అన్నారు. ప్రస్తుతం ఓచర్ల మీద కార్మికుల సంతకాలు తీసుకొని డబ్బులను ఇస్తున్నారని వారు తెలిపారు. గ్రామంలోని 25 మంది ఉపాధి హామీ కార్మికులకు మే నెల కూలీ డబ్బులను రావాల్సి ఉండగా కార్మికుల సంతకాలను ఫోర్జరీ చేసి సుమారు 1.60 లక్షల రూపాయలను బీపీఎం డ్రా చేశారని గ్రామస్తులు ఆరోపించారు. కార్మికులు తమ కూలీ డబ్బులను డ్రా చేయకుండానే, డ్రా చేసినట్లుగా రెండు రోజులుగా వారి సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు రావడంతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు, వెంటనే తపాలా (పోస్టల్) ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్మికుల కూలీ డబ్బులను కాజేసిన బిపిఎంపై తగు చర్య తీసుకుని, కార్మికులకు రావాల్సిన కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, సంజీవ, ఐలయ్య అండమ్మ, లక్ష్మి, భవాని, లింగమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు మాజీ మున్సిపల్ చైర్మెన్ బర్రె జహంగీర్ వినతి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న రైతుల నుంచి మానేపల్లి రామారావు వారి కుటుంబ సభ్యులు భూమిని తక్కువ ధరకు కొనుగోలు చేసి స్వర్ణగిరి దేవస్థానం నిర్మించి ప్రయివేటు వ్యాపారం కొనసాగించడం పట్ల ఆలయ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మెన్, దళిత నాయకులు బట్టు రామచంద్రయ్య జిల్లా కలెక్టర్ హనుమంత్ కే జెండగేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..భువనగిరి మండలం పగిడిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఉన్న అసైన్డ్ భూమిని అప్పటి రాజకీయ, ఆర్థిక పలుకుబడితో మానేపల్లి రామారావు వారి కుటుంబ సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు తీసుకుని స్వర్ణగిరి ఆలయం నిర్మించి అక్కడ వీక్ ఎండ్ వచ్చే భక్తులకు వాహనాలకు సరైన సందు లేకుండా ట్రాఫిక్ నియంత్రణలో నియమనిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులచే ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వచ్చే భక్తుల ఆదాయంతో లాభాలు గడించాడని ఆరోపించారు. వారిపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం వెంటనే చొరవ చూపి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయాన్ని సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో జాతీయ రహదారి నేషనల్ హైవే అథారిటీ వారు ఎల్లమ్మ గుడి నుంచి రైల్వే గేటు సమీపంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా అలాగే ఉంచారని ప్రస్తుతం స్వర్ణగిరి ఆలయ నిర్మాణంతో రద్దీ విపరీతంగా పెరిగిపోయి తరుచూ ట్రాఫిక్ ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతుందని వెంటనే సర్వీస్ రోడ్డు పూర్తి చేసి ప్రయాణికులకు వాహనాదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

10న 'ఉపాధిహామీ'పై రాష్ట్ర సదస్సు

- వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి పిలుపు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు- సవాళ్లు' అనే అంశంపై నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సులో ఉపాధి హామీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కాకుమారి పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డి గూడెం గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం కార్మికులతో కలిసి సదస్సు ను జయప్రదం చేయాలని కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చొక్కాకుమారి మాట్లాడుతూ కొలతలు లేని పనికి కొలతలు పెట్టి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం కోతలను రద్దు చేసి రోజుకు ఆరు గంటల పనికి 600 రూపాయల కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని గతంలో అమలు చేసిన విధంగా పని ప్రదేశంలో మౌలిక వసతలు కల్పించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ పది సంవత్సరాల పాలనలో ఉపాధి హామీ పథకంలో అనేక జీవోలు తీసుకొచ్చి చట్టాన్ని ఎత్తివేయాలని కుట్రలు చేస్తున్నదని బీజేపీ పాలనలో కార్మికుల సమస్యలు రెట్టింపు అయ్యాయని ఆవేదన వెలిబుచ్చారు. ఉపాధి హామీ చట్ట చట్ట పరిరక్షణ కోసం, మున్సిపల్ పట్టణాల్లో కూడా ఉపాధిహామీని అమలు చేయాలని, కనీస కూలీ 600 లు, సంవత్సరానికి 200 పని దినాలు, చట్టంలో ఉన్న అన్ని అంశాలను అమలు చేయాలని కోరుతూ ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సు ముఖ్య అతిధులుగా గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు శ్రీమతి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాజ్యసభ సభ్యులు శివ



దాసన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్. వెంకట్రాములు పాల్గొంటున్నారని వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో డి కళమ్మ ఎం సుజాత, ఎం పోచమ్మ , ఎం రాములమ్మ , డి ధనలక్ష్మి , ఎ సత్తమ్మ , ఎం స్వరూప, కే మంగమ్మ ఎస్ పద్మ, ఎస్ సుజాత, బి రేణుక, ఆర్. చంద్రకళ, ఆర్ కలమ్మ, ఏ పద్మ లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం జూన్ 07 , 2024 www.navatelangana.com

నరసింహచారి సంతాప సభ

నవతెలంగాణ-చిట్యాలటౌన్
చిట్యాల మండలం నేరడ గ్రామంలో నాగార్జున నరసింహ చారి గత కొద్దికాలం క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. గురువారం నాడు ఆయన సంతాప సభకు మాజీ ఫిష్ అండ్ గోట్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బాలాపూర్ కాంగ్రెస్ సీనియర్ సీనియర్ నాయకులు అందోజు లక్ష్మణాచారి,ఆవుల ఆనంద్, శ్రీనివాస చారి, మారోజు శ్రీనివాస్ చారి, మారోజు మహేష్, దుబ్బాక నవీన్‌రెడ్డి, మారోజు కిరణ్, మారోజు రాజు, రాపోలు మహేష్, ఐతరాజు స్వామి, రాపోలు గణేష్, తదితరులు పాలుగొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-చండూరు
ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తేరేట్పల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ అన్నారు. బుధవారం గట్టుపల్ మండలం లోని తేరేట్పల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో మైక్ సెట్ ద్వారా ప్రచారం నిర్వహించారు. మీ పిల్లల చదువులకు మేము గ్యారెంటీ అని పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపి డబ్బులు వృథా చేసుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సధాకర్ రెడ్డి,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ రేణుక, ఉపాధ్యాయులు గోన వెంకటేశ్వరరావు, నరసింహ, రాణి, మల్లేశం,వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డా.మల్లు గౌతమ్ రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ
పెండింగ్‌లో ఉన్న ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి కోరారు. గురువారం స్థానికంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పి హెచ్‌సీ సెంటర్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుపరచాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం 18వేలు ఇవ్వాలని ప్రతి నెల రెండో తేదీన పారితోషకం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా వర్కర్లకు 50 లక్షల ఇన్సూరెన్స్ అవసరం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు ఇవ్వాలని, చనిపోయిన ఆశ వర్కర్ల కుటుంబానికి మట్టి ఖర్చుల కింద 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంటు రామారావు ఆశ వర్కర్ పద్మ, కవిత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మెన్ శంకరయ్య



నవతెలంగాణ-ఆలేరుటౌన్
యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ హనుమంతు కే జెండగేని ఆలేరు మున్సిపల్‌లోని డబల్ బెడ్ రూమ్, కెసిఆర్ కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు, మురుగు నీటి పోవుటకు అవుట్లెట్ లేనందున శాశ్వత పరిష్కారం కోరుతూ.. ఆలేరు మున్సిపల్ చైర్మెన్ వస్పర్ శంకరయ్య కలెక్టరేట్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యను వెంటనే పరిష్కరించాలని, నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బట్టు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్మీడియట్ బోర్డు ఎదుట ధర్నా

- జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం రాజు పిలుపు

భువనగిరి అర్బన్:తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కార్యాలయం వద్ద నేడు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వనం రాజు గురువారం ఒక ప్రకటనలో పిలునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో లక్షల రూపాయల ఫీజులు అక్రమంగా వసూలు చేస్తున్న శ్రీ చైతన్య, నారాయణపై చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా నడుపుతున్న కార్పొరేట్ కళాశాలల క్యాంపస్ మూసివేయాలని ఇంటర్ విద్యలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేసి సమస్యలు పరిష్కారం చేయాలని ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు పరచాలని జరుగుతున్న ధర్నాను విద్యార్థి లోకమంతా జయప్రదం చేయాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహంతి వైష్ణవి

నవతెలంగాణ-చౌటుప్పల్
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహంతి వైష్ణవి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చౌటుప్పల్ కోర్టు ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా జడ్జి మహంతి వైష్ణవి మాట్లాడుతూ మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నాటి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మానవ మనుగడకు పర్యావరణ పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు తాడూరి పరమేశ్, కోశాధికారి పడమటి మహిపాల్‌రెడ్డి, న్యాయవాదులు ఎలమోని శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, బడుగు శ్రీకాంత్, ఎమ్‌డి.ఖయ్యుమ్‌పాషా, శ్రీశైలం, రాఘవేంద్ర, సూపరింటెండెంట్ నరేశ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ కలెక్టరేట్ :టమ్కామ్, ఫెడరల్ ఎంప్లాయ్ మెంట్ ఏజెన్సీ మధ్య కొనసాగుతున్న ట్రిపుల్ విన్ పార్ట్ నర్ షిప్ లో బాగంగా జర్మనీలో రిక్రూట్మెంట్ అయ్యే నర్సులకు జర్మన్ భాష శిక్షణ కోసం ప్రత్యేక స్క్రీనింగ్, ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం జరుగుతోందని, ధరఖాస్తు చేయడానికి ఈనెల 10వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 21-38 సంవత్సరాల వయస్సు కలిగి జి ఎన్ ఎం, బీఎస్సీ లో తెలంగాణ లోని గుర్తింపు పొందిన కళాశాల నుండి నర్సింగ్, ఐసియు, జేరియాట్రిక్స్, అర్థోపెడిక్స్, సైకియాట్రీ, కార్డియాలజీ, నియోనాటల్, సర్జికల్ వార్డు మొదలైన వాటిలో కనీసం 1-3 సంవత్సరాల ప్రొఫెషనల్ క్లినికల్ పనిచేసిన అనుభవం, జర్మన్ బాషా నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులు కూడా దరఖాస్తూ చేసుకోవచ్చు అని తెలిపారు. జర్మన్ భాష శిక్షణ ఉచితం. జర్మన్ భాషా పరీక్షను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత ఎంపిక చేసిన అభర్థులకు స్టైఫండ్ చెల్లించబడుతుంది. కనీస జీతం 2300 నుండి 2800 యూరోలు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్రోల్మెంట్ గురించి మరిన్ని వివరాల కోసం, ఆసక్తిగల అభ్యర్థులు www.tomcom.telangana.gov.inను సంప్రదించాలని లేదా 9908830438, 8919047600, 7032379066, 8499990304 సంప్రదించాలని తెలిపారు.



లింగమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే, జెడ్పీచైర్మెన్

నవ తెలంగాణ-నార్కట్ పల్లి
మండల పరిధిలోని షాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సిద్దగోని స్వామి మాతృమూర్తి సిద్దగోని లింగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతదేహానికి గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం , జెడ్పీచైర్మెన్ బండ నరేందర్ రెడ్డి వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు., ఈ కార్యక్రమం లో నల్లగొండ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, నార్కట్ పల్లి ఎంపీటీసీ ముత్తయ్య , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య , నక్కపల్లి మాజీ సర్పంచ్ మాధవి నరసింహ , షాపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, సట్టు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-శాలిగౌరారం
మండలంలోని తక్కళ్ల పహాడ్ గ్రామంలో నిరుపేద చెరుకు సోమమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కట్టంగూరి మహేందర్ రెడ్డి, కట్టంగూరి సురేందర్ రెడ్డి మనుమడు చెరుకు ఉపేందర్‌కు రూ.5116 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు తీరుపారి మల్లయ్య, వజ్జే బిక్షయ్య, చెరుకు జానయ్య తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు ఆల్బెండజోల్ వేయాలి



నవతెలంగాణ-చివ్వెంల
ఆల్బెండజోల్ టాబ్లెట్స్ 19 సంవత్సరాల పిల్లలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, అంగన్వాడి చిన్నారులు, ప్రాథమిక పాఠశాల పిల్లలకు టాబ్లెట్స్ ఈనెలలో వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ నెలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందికి, కార్యకర్తలకు ఆల్బెండజోల్ టాబ్లెట్ల గురించి అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలోని పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఆశాలు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా వేపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. భవాని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యాదగిరి, సూపర్వైజర్ డి. శిరోమణి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్
నేటి మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వ సభ్యా సమావేశం వాయిదా వేయలని కొందరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కోరారు. అందువల్ల శుక్రవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సమావేశం అతి తొందరలో నిర్వహిస్తామని, తిరిగి తేదీని కూడా ప్రకటిస్తామని తెలిపారు.

నేడు సాయిబాబ ఆలయం 17వ వార్షికోత్సవ వేడుకలు



- ఘనంగా మూడు రోజులు వార్షికోత్సవాలు
- ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచికంటి ధనంజయ్య

నవతెలంగాణ-చింతపల్లి
భక్తుల కోరికలు తీర్చేటి కొంగు బంగారంగా రాష్ట్రంలోనే రెండవ శిరిడి క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని సాయి సన్నిధి ఆలయంలో నేటి నుండి మూడు రోజుల వరకు 17వ సప్తదశమ వార్షికోత్సవాలకు దేవాలయం అంగరంగ వైభవంగా ముస్తాబైనట్లు ఆలయ చైర్మెన్ మంచి కంటి ధనంజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి సీతారాముల, లక్ష్మీనరసింహస్వామి, శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వరల్లా కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటామని తెలిపారు. ఈనెల 7 8 9 తేదీలలో జరగనున్న 17 వార్షికోత్సవ వేడుకలకుఅన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

చామలకు ఘన సన్మానం

నవతెలంగాణ-భువనగిరి
ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని భువనగిరి పట్టణంలోని స్థానిక న్యూవివేరా హెూటల్లో గురువారం ఘనంగా సన్మానించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజా గోపాల్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశతో పాటు పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు యాదగిరిగుట్ట దర్శనార్థం వెళ్తూ భువనగిరిలో ఆగారు ఈ కార్యక్రమంలో నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్, బిసుకుంట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమం



నవతెలంగాణ -పెద్దవూర
మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. దీన్ని ఎంఈఓలుబాలునాయక్, తరిరాము ప్రారంభించారు.మండలంలోని పెద్దవూర,చలకుర్తి, పెద్దగూడెం, వెల్మ గూడెం, పర్వేదుల, పడమటి పూలగూడెం, పుల్యా తండా, పొట్టేవాని తండా, నాయిన వాణికుంట తండా,జయరాంతండా, కొత్తగూడెం బట్టుగూడెం, బసిరెడ్డి పల్లి, తెప్పల మడుగు, పోతునూరు,శిరసన గండ్ల, పెదగూడెం, చిన్నగూడెం,నాయిన వాణికుంటసీమానాయక్ తండా, పొట్టేవాని తాండ, కొత్తలూరు, గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మెన్లు విద్యార్థుల పాల్గొన్నారు.

నాంపల్లి : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అమ్మ ఒడి ఆదర్శ పాఠశాల చైర్మన్, మండల సమైక్య అధ్యక్షురాలు ఇందిర గురువారం ప్రారంభించారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



నవతెలంగాణ-చండూరు
ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని చామలపల్లి మాజీ ఎంపీటీసీ నేర్లకంటి రవి కుమార్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. బుధవారం అని విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఒక ఎంపీగా కీలక భూమిక నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రజల కల సాకారం చేయడమే కాకుండా, తెలంగాణ మొత్తం కెసిఆర్ గాలి విచినా కూడా ఒకసారి ఎమ్మెల్సీగా ఒకసారి ఎమ్మెల్యే గా.. భారీ మెజారిటీ తో గెలిచి అప్పట్లోనే కెసిఆర్ కు తన సత్తా చూపాడు..కరోనా మహమ్మారి సమయంలో ప్రతి గడపకు నిత్యావసర సరుకులు పంపించిన రాష్ట్రంలోనే ఏకైక నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా వృద్ధాశ్రమం పెట్టి ఎంతో మంది అభాగ్యులకు ఆశ్రయం కల్పించిన గొప్ప మానవతావాది. అంతేకాదు 2018లో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన 12 మంది ఎమ్మెల్యే లు కెసిఆర్ కు అమ్ముడుపోయినా కూడా తాను మొండి పట్టుదలతో కెసిఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా పెట్టుకొని.. కెసిఆర్ కుటుంబ పాలననుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగించడమే కాకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను తెలంగాణ గడ్డపై ఎగురవేయుటలో ముఖ్య పాత్ర పోషించాడు.

కాటయ్య మృతి గౌడ సంఘానికి తీరని లోటు

- గౌడ సంఘం అధ్యక్షులు గుండగోని జంగయ్య గౌడ్

నవతెలంగాణ-నకిరేకల్
బాధిని కాటయ్య గౌడ్ మృతి గౌడ సంఘానికి తీరనిలోటని నోముల కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నోముల గ్రామానికి చెందిన గౌడ సంఘం సభ్యుడు అనారోగ్యంతో మృతి చెందిన భాదిని కాటయ్య గౌడ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షులు కొప్పు వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి రాచకొండ హుస్సేన్, గౌడ సంఘం పెద్దలు బాధని వెంకటరమణ గౌడ్, బాదిని యాదయ్య గౌడ్, గౌడ సంఘం సభ్యులు దిండుగాల సైదులు, ఎరుకల రాజు రాచకొండ ముత్యాలు నర్సింగ్ సైదులు కుక్కల నాగరాజు, భూపతి సైదులు, ఎల్లమ్మ కంటి రాములు, రాచకొండ పాపులు పాల్గొన్నారు.



కరాటే డోజో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



నవతెలంగాణ-నకిరేకల్
జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బెల్ట్ ఎగ్జామ్ పోటీలలో ఎస్ ఆర్ ట్రస్ట్ కరాటే డోజో విద్యార్థులు బెల్టులు, సర్టిఫికెట్లు సాధించినట్లు జెకె ఏఐ జిల్లా జనరల్ సెక్రటరీ అంతటి సోములుగౌడ్ తెలిపారు.బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎం సత్యరాజ్, కే రేఖ, కే శివ కేశవ్,, ఏ భవ్య శ్రీ బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ సాధించారు. కలర్ బెల్ట్ విభాగంలో చరణ్, జస్వంత్, నిక్షిత, కృతిక, బిందు, అభి ఉన్నారు. ఈ పరీక్షలు తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బెల్టులు సాధించిన విద్యార్థులకు ఎన్ఆర్ ట్రస్ట్ కార్యదర్శి కందాల ప్రమీల, కెఆర్ ట్రస్టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రకాష్ రావు బెల్టులు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు ఆర్ విజయ్ కుమార్, ఏ అంజి, శ్రీనివాస చారి, పి సాయికిరణ్ , పవన్ కళ్యాణ్, హైదరాబాద్ మాస్టర్లు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సహకారంతో వీల్ చైర్ అందజేత



నవతెలంగాణ- చిట్యాల టౌన్
పట్టణ కేంద్రంలోని స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ చిట్యాల అధ్యక్షుడు గుండెబోయిన సైదులు ఆధ్వర్యంలో క్లబ్ డెవలప్‌మెంట్ జోన్ టు చైర్మెన్ డాక్టర్ వేంపల్ల బుచ్చిరెడ్డి సహకారంతో డాక్టర్ అహ్మద్‌కు రోటరీ క్లబ్ సభ్యులు వీల్ చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ చిట్యాల ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీశైలం ,కంభంపాటి నరసింహ, గాలి యాదగిరి ,ఏనుగు రవీందర్ రెడ్డి, గుండెబోయిన శివ సాయి స్థానిక హాస్పిటల్స్ సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మయ్య జన్మదిన వేడుకలు

తిరుమలగిరి :తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి సీనియర్ జర్నలిస్ట్ కందుకూరు లక్ష్మయ్య జన్మదిన వేడుకలను గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లక్ష్మయ్యచే కేక్ కట్ చేయించి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వై నరేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు కందుకూరు అంబేద్కర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్, పేరాల వీరేష్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రవీందర్



నవతెలంగాణ-నకిరేకల్
ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ ఆయనను కలిసి పూలబుకే అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
శుక్రవారం | జూన్ 07, 2024 | www.navatelangana.com

ఆశాలకు పరీక్ష పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-నాంపల్లి

ఆశా కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్ష పెట్టే నిర్ణయాన్నితక్షణమే ఉపసంహరించుకొని గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ ఆశాలు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణా కార్యక్రమాలను పొంది రిజిస్టర్లు రాయడం సర్వేలు చేస్తున్నారని తెలిపారు. గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలు ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ నెల 13 జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు ఆశాలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు రామావత్ కవిత, ఉపాధ్యక్షురాలు ఏదుళ్ళ కవిత, జిల్లా కమిటీ సభ్యులు సిర్ర మమత, కోరే లలిత, కమిటీ సభ్యులు యాదమ్మ శోభ, విజయలక్ష్మి, రేణుక, నీలిమ సైదమ్మ ,సునీత, అరుణ, అంజమ్మ లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పుట్టినరోజు సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వీర సారపు యాదగిరి గౌడ్, ఆలేరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఊట్కూరి సురేష్, యువజన కాంగ్రెస్ నాయకులు అయిలన్న అభిమానుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది (యూనిట్లు) కాంగ్రెస్ పార్టీ అభిమానులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, రాష్ట్రస్థాయి, ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు అభిమానులు, కాంగ్రెస్స్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విధిగా భూసార పరీక్షలు చేయాలి

- జేడీఏ కే.అనురాధ

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం



రైతులు విధిగా తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకుని పోషక లోపాలు సరి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. పంపుధవారం మండలంలోని వాయిల్లపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసార పరీక్షల అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. షెడ్యూల్ తెగ ఉప ప్రణాళిక పథకం లో భాగంగా షెడ్యుల్ రైతులకు భూసార పరీక్షల పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పలువురి రైతులకు మినీ భూసార పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు గొల్లపెళ్ళి రత్నాకర్ మాట్లాడారు. భూమిలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పంటల సాగు లో పెట్టె పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందన్నారు. భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్ర నగర్ అభివృద్ధి చేసిన ఈ కిట్ తో రైతు స్థాయి లో ప్రధాన పోషకాలు నత్రజని, పోటాష్, భాస్వరం, ఉదజని స్థాయి, పరీక్ష చేసే విధానం పై శిక్షణ ఇచ్చారు. రైతులకు నేలను సారవంతం కు చేపట్టాల్సిన చర్యలు వివరించారు.పశువుల ఎరువు,పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియ దున్నడం వల్ల పూసారం పెరుగుతుందన్నారు. జీవన ఎరువులు, పంట మార్పిడి,చెరువు మట్టి వంటివి రైతులు తమ నేల సారవంతం చేస్తా యన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనిల్ కుమార్మం, వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఎంపీటీసీ జంగయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు నవీన్, పర్శురములు, అరుణా, శివ, శశిబిందు, స్వప్నిక మరియు రైతులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-నల్లగొండటౌన్



నిరుపేదలకు భూమి దక్కాలని దేశవ్యాప్తంగా భూ పోరాటాలకు శ్రీకారం చుట్టిన చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగాఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం పేద వర్గాల కోసం అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి కార్మిక రైతాంగ ఉద్యమాలకు నాయకత్వం వహించి సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసే నీతి నిజాయితీ కడవరకు పేద వర్గాల హక్కుల కోసం నిలబడ్డ నాయకుడు చందా రాజేశ్వరరావు అన్నాడు. ఆనాడు చెల్లంపల్లి జమీందారు వ్యతిరేకమైన పోరాటం అటు తర్వాత భూస్వామ్య వ్యతిరేక పోరాటాలునాయకత్వం వహించి భూ పోరాటాలకు నాంది పలికిన యోధుడు, చంద్ర రాజేశ్వరరావు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పబ్బు వీరస్వామి, లెనిన్, ముత్యాలు, సుజాత, మదర్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

- బెలూన్స్ ఓపెన్ కావడంతో తప్పిన ప్రాణాపాయం

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ పైన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురు తీవ్ర గాయాలు కాగా, మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. .వన్ టౌన్ ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ రామచంద్ర గూడెంకు చెందిన సోదరులు ఊట్ల రామారావు, ఊట్ల ప్రసాద్ రావులు తమ ఎక్స్ యు వి 700 కారులో ఆంధ్రప్రదేశ్ లోని గురజాల వెళుతుండగా మిర్యాలగూడ ఫ్లైఓవర్ పైకి చేరుకోగానే స్కార్పియో వాహనంలో నల్గొండ వైపు వేగంగా వెళుతున్న మెకానిక్ పొదిల వేణు కారు అదుపుతప్పి డివైడర్ను ఢీకొని అవతల రోడ్డు పైకి వెళ్లి ఎదురుగా వస్తున్న ఎక్స్ యు వి కారును బలంగా ఢీకొట్టడంతో కార్లు రెండు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యాయని తెలిపారు.ఈ ప్రమాదంలో స్కార్పియో డ్రైవర్ పొదిల వేణు,ఊట్ల ప్రసాద్ రావులు తీవ్రంగా గాయపడగా, రామారావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న వన్ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్లలో ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పినట్లు అయిందని, లేకపోతే మరింత నష్టం వాటి లేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

పేదల పక్షాన పోరాటాలు నిర్వహించేది సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మేళ్ళచెరువు



మేళ్లచెరువు మండల కేంద్రంలో సీపీఐ(ఎం) గ్రామశాఖ సమావేశం నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వట్టెపుసైదులు. మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో హుజూర్నగర్ మండలం శ్రీనివాసపురం గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని వారన్నారు. ఈ క్లాసులకు పార్టీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో, దేశంలో సీపీఐ(ఎం) అనునిత్యం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామని, పార్టీ సభ్యులు రాజకీయంగా చైతన్యంగా ఉండాలన్నారు. దేశంలో మతతత్వ బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుండి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వారి విమర్శించినారు. భారతదేశంలో లౌకిక విలువలను. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడడం కోసం ప్రజలు చైతన్యంగా బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని మన ప్రభుత్వాన్ని కోరారు. మండలంలో ప్రభుత్వ భూములు ఫారెస్ట్, డిఫారెస్ట్ ప్రభుత్వ భూములు పేదల పంచాలన్నారు. మేళ్లచెరువులో ఇందిరమ్మ కాలనీ పేదలకు పట్టాలు ఇవ్వాలని, ఉమ్మడి మండలంలో భూములను పేదలు ఆక్యుపై చేసుకుంటే అధికారులు భూములు మీదికి పోకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. మండల వ్యాప్తంగా ప్రజలు చైతన్యం చేస్తూ సీపీఐ(ఎం) పోరాటాలకు ప్రజలు రైతులు. వ్యవసాయ కూలీలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల నాయకులు గుండు సైదులు, ఉన్నూరు మరియమ్మ బద్దుల సైదులు, అశోక్, నరేష్, అంజి బి సైదులు, శంబయ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-రాజాపేట



మండలంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద గురువారం అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 800 మందికి పైగా అన్నదానంలో పాల్గొని అభినందించారు. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ప్రతిష్ట మూర్తులకు ప్రత్యేక పూజలు చేయగా తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జం కృష్ణమూర్తి, మార్త జగదీశ్వర్, బుడమ్మ సత్యనారాయణ, పూసునాల సాయి, యువజన సంఘం మండల శాఖ అధ్యక్షులు నంగునూరు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది సంతోష్ కుమార్, ఉప్పల శ్రీనివాసులు, బెజుగం చంద్ర శేఖర్, మండల శాఖ కోశాధికారి గంగిశెట్టి రాజు, పుల్లూరు శ్రీను, బెజుగం సంతోష్, బెజుగం చంద్రశేఖర్, బెజిగం సాయి, మాశెట్టి శ్రీనివాసులు, రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్, రంగసత్యం ఉన్నారు.

వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

జిల్లా మహాసభల కరపత్రం విడుదల

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక చౌటుప్పల్ డివిజన్ మహాసభ స్థానిక మార్కెట్ యార్డులో భూపాల్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సురుపంగా ప్రకాష్ వనం ఉపేందర్ జిల్లా మహాసభల కరపత్రం విడుదల చేసి మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని, గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక గణాంకాల విభాగం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం 19 శాతం మంది చూపు, వినికిడి లోపం కలిగి ఉన్నారని, 8 శాతం మంది బహుళ వైకాల్యం కలిగి ఉన్నారని అన్నారు. 76 శాతం మంది గ్రామీణ ప్రాంతంలో 24 శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే పెన్షన్స్ కేవలం 5.75లక్షల మందికే వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను ప్రకటించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సభర్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని డిమాండ్ చేశారు. సామూహిక ప్రాంతాలన్నీ అవరోధ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చేసి 4 ఏండ్లు అవుతున్న ఎలాంటి పురోగ తిలేదన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం అమలు పర్యవేక్షణ కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. మానసిక, అటీజం, హేమో ఫిలియా, సికిల్ సెల్, కండరాల క్షీనత వంటి వైఖల్యాలు కలిగిన వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ద్రుష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కవి, రచయిత, బాధిరుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 144వ జయంతి ఉత్సవాలు రాష్ట్ర వ్యాపితంగా జరుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొల్లేపల్లి స్వామి జిల్లా మహిళా కన్వీనర్ కొత్త లలిత చౌటుప్పల్ డివిజన్ కార్యదర్శి ఏర్పుల శివయ్య డివిజన్ నాయకులు సంజీవ శంకర్ బర్ల పార్వతి జోకు స్వామి పిట్ట శ్యాంసుందర్ రాయగిరి యాదగిరి మాసపల్లి కృష్ణ ముదిగొండ రాములు బల్గూరి అంజయ్య పిట్ట శ్రీనివాస్ రెడ్డి మంగమ్మ రమాదేవి తిరుపతి రెడ్డి,రవి మాసంపల్లి కృష్ణ కే శ్రీనివాసాచారి వడ్డేపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులకు మద్యం అమ్మొద్దు

వైన్ షాపుల యజమానుల సమావేశంలో ఏసీపీ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



బెల్ట్ షాపులకు మద్యం అమ్మవద్దని వైన్ షాపుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం చౌటుప్పల్ ఏసీపీ కార్యాలయంలో చౌటుప్పల్ డివిజన్ వైన్ షాపుల యజమానులతో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పటోళ్ల మధుసూదన్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బెల్ట్ షాపులకు మద్యం అమ్మ వద్దని హెచ్చరించారు. బెల్ట్ షాపులలో మద్య మమ్ముతో పట్టుబడితే వారు కొన్న వైన్ షాప్ యజమానుల పైన కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గతంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేస్తామని పోలీసులకు ఆదేశాలు ఇచ్చిన మాట వాస్తవమే. దీని దృష్టిలో పెట్టుకొని మరొకసారి వైన్ షాప్ యజమానులను బెల్ట్ షాపులకు మద్యం అమ్మకాలను నిషేధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ ఎస్ సైదులు చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి రామన్నపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నారాయణపూర్ సబ్ ఇన్స్పెక్టర్ జగన్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'అయ్యప్ప స్వాముల ఇబ్బందులపై ఐక్యంగా పోరాడుదాం'

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



అయ్యప్ప స్వాములకు కేరళలోని ట్రావెన్కోర్ దేవస్థానం వద్ద ఇబ్బందుల దృష్ట్యా తెలంగాణ అధికార యంత్రాంగాన్ని శబరిమలలో ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలంగాణ ఐఖ్య వేధిక నాయకులు నాయిని బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వడాయిగూడెం వైఎస్ఎస్ఎస్ వాసవి నిత్యాన్నదాన సత్రం సురేంద్రపురి నందు తెలంగాణ అయ్యప్ప ఐఖ్య వేధిక ముఖ్య గురుస్వాముల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అయ్యప్ప మాల వేసుకుని ఏటా లక్షలాది మంది శబరిమలకు వెళ్తున్నా అక్కడ కనీస వసతులు మంచినీరు, ఆహారం. వైద్య సహాయం అందక ఎన్నోమంచినీరు, ఆహారం, వైద్య సహాయం అందక ఎన్నో అవస్తలు పడుతున్నారని, ట్రావెన్కోర్ దేవస్థానం బోర్డు కేరళ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జేఏసి కోరారు. ఈ కార్యక్రమంలో రాధకృష్ణ గురుస్వామి. ప్రేమ్ గాంధీ గురుస్వామి. వైఎల్ఎస్ఎస్ వాసవి సత్రం అధ్యక్షులు ఐత రాములు, గురుస్వాములు మీద విజయ్ కుమార్, పెండెం శ్రీనివాస్, చీకటిమల్ల రాములు దాసోజు విశ్వరూపం, రాంపల్లి చంద్రం, ఎన్వీడి నాగేశ్వర్ రావు, ఏదులబాదు కృష్ణ, ప్రకాష్, శివ శంకర్, కళ్లెం వెంకటేష్, రమణ, రచ్చ ప్రభాకర్, సురేష్ రెడ్డి, ఆనంద్‌లు పాల్గొన్నారు.

దళిత, బహుజనులకు రాజ్యాధికార ఏర్పాటే లక్ష్యం

- రఘువీర్‌రెడ్డికి ఓటు వేసినందుకు కృతజ్ఞతలు

మాదిగ సంఘాల మహాకూటమి నాయకులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ రాష్ట్ర మాదిగ సంఘాల మహాకూటమి ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకు మహా కూటమి పనిచేస్తుందని దళిత బహుజనులకు రాజ్యాధికార ఏర్పాటుకు ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని మాహ కూటమి నాయకులు ఊర రామకృష్ణ పోలేపల్లి ఉదయ్ కుమార్ పోకల రవి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని 5 నియోజకవర్గాల నా మాదిగ ఉపకులాల ప్రజలు ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి హస్తం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడం శుభ పరిణామంగా భావిస్తున్నామన్నారు. గత పది ఏళ్ల కాలంలో మాదిగ ఉపకులాల ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం అణిచి వేసి అక్రమ కేసులతో ఆవేదనకు గురి చేశారన్నారు. అందుకే పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో మాదిగ ఉప కులాల ప్రజలు కెసిఆర్ కుటుంబానికి ఓటు అనే ఆయుధం ఉపయోగించుకొని ఖాతా కూడా తెరవకుండా చేశారన్నారు.ఇకనుంచైనా బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నామాదిగ ఉపకులాల ప్రజలు జాతి ఆత్మగౌరవం కాపాడేందుకు మహాకూటమితో కలిసి రావాలని పేర్కొన్నారు.

రైతులకు ఎరువులు విత్తనాలు అందేలా అన్నిచర్యలూ తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం నాడు ఆమె రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్ -1 పరీక్షల నిర్వహణ, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సుల అందజేత కార్యక్రమాలను సమీక్షించారు. రైతులందరికీ విత్తనాలు, ఎరువులు సకాలంలో ప్రతి ఒక్కరికి అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని, పోలీసు, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించాలని, కంట్రోల్ రూముల ఏర్పాటుతో నిఘా పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. విత్తన డీలర్ల రిజిష్టర్లను తనిఖీ చేయాలని, ప్రతి రోజూ డీలర్ల నుండి రిపోర్టులు పరిశీలించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సందర్భంగా జూన్ 11 లోగా విద్యార్థులకు అందించే డ్రెస్సులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరు హనుమంత్ కే జెండగే విత్తనాలు, ఎరువుల గురించి వివరిస్తూ జిల్లాలో ఇప్పటి వరకు 78,345 పత్తి విత్తనాల ప్యాకెట్స్ అమ్మడం జరిగిందని, ఇంకా 66,858 పత్తి విత్తనాల ప్యాకెట్స్ అందుబాటులో వున్నాయని, అలాగే ఎరువులకు సంబంధించి 14,117 మెటిక్ టన్నుల యూరియా, 829 మెటిక్ టన్నుల డిఎపి, 4160 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 375 మెటిక్ టన్నుల పొటాష్, 186 మెట్రిక్ టన్నుల సూపర్ఫాస్ఫేట్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీకి సంబంధించి క్షేత్రస్థాయిలో అని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, జిల్లా పంచాయితీ అధికారి సునంద, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకర్‌లు పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గా దేవి 9వ వార్షికోత్సవ కరపత్రం విడుదల

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆలేరు పట్టణంలో కనకదుర్గాదేవి ఆలయ 9వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ఆలయ ప్రధాన అర్చకులు ఆలేటి రంగన్న పంతులు, ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని పలు,కుల సంఘాల సమక్షంలో కరపత్రాన్ని విడుదల చేశారు. జూన్ 15వ తేదీ శనివారం అమ్మవారి కలశ స్థాపన, 16వ తేదీ ఆదివారం అమ్మవారి కళ్యాణ మహోత్సవం, ఏడవ తేదీ సోమవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుట, 18వ తేదీ భక్తులు బంధుమిత్రులతో కలిసి వనభోజనాలు ఏర్పాటుకు నిర్ణయించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొలుపుల హరినాథ్ తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కులసంఘాల నాయకులు పుట్ట మల్లేశం డాక్టర్ చింతకింది మురహరి, కొరుటూరు నరసింహులు, సంగు భూపతి, బెతి రాములు, నీలం వెంకటస్వామి, కమిటికారి అశోక్, నంద గంగేష్, రామ్మూరి, శివ, కుతాటి అంజన్ కుమార్, చీమ్మి ఆనంద్ , మొరిగాడి బాలరాజు, సీసా నరసింహులు, సరపు సంతోష్, ఉప్పలయ్య, యాదగిరి, నరసింహులు, శివ భక్తులధిక సంఖ్యలో పాల్గొన్నారు.